క్లుప్తంగా

కండ్లకలకపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: కండ్ల కలక వ్యాధి పట్ల విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. బైర్లూటి సంక్షేమ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కండ్ల కలకపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను పరిక్షించగా 8 మందికి కండ్లకలక సోకినట్లు నిర్ధారించారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది దీపిక, జ్యోతి, సరస్వతి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి


బ్రాహ్మణకొట్కూరులో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ మంజులవాణి

నందికొట్కూరు రూరల్ : వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని డీపీఓ మంజులవాణి అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో డ్రైనేజీలు, నీళ్ల ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరళ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మేలైన విత్తనాలు అందించాలి

నందికొట్కూరు: రైతులకు మేలు రకమైన విత్తనాలు, ఎరువులు అందించాలని జాతీయ వ్యవసాయ యాజమాన్య సంస్థ హైదరాబాద్ అధికారి కాంచన సూచించారు. బుధవారం పట్టణంలోని ఆత్మ భవనంలో ఏర్పాటు చేసిన దేశి శిక్షణ పొందిన ఫెర్టిలైజర్లు, పస్టిసైడ్ దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. దేశి శిక్షణ పొందిన డీలర్లు రైతులకు వ్యవసాయంపై మెలకువలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ జీఎం శ్రీలత, సమన్వయకర్త వీరారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి కృషి


కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్

మిడుతూరు: ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని తలముడిపి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించడంతో పాటు కూలీల సమస్యలపై ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తానని చెప్పారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ జయంతి, ఈసీ నరేష్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పథకాలను అందిచాల్సిన బాధ్యత అధికారులదే


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి

కొత్తపల్లి: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత అధికారులదేనని, వారి నిర్లక్ష్యంతో నిజమైన లబ్ధిదారులు నష్టపోకూడదని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కె.కుసుమలత అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీడీఓ మేరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అందరి సమన్వయంతో అధికారులు పనిచేయాలన్నారు. ఏ ఒక్క అర్హుడూ నష్టపోకుండా పథకాలు అందించాలన్నారు.

గిరిజనులకు రక్షణ కల్పించాలి

కొత్తపల్లి: మణిపూర్‌లో గిరిజన, క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కేవీపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.యేసురత్నం, ఎన్ సంపత్, మాల మహానాడు సీనియర్ నాయకుడు గనమల మల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు రాజు, ఎన్ స్వాములు, బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ పాల్గొన్నారు.

కేంద్రం బాధ్యత తీసుకోవాలి

ఆత్మకూరు: మణిపూర్‌లో చెలరేగుతున్న మారణకాండకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని ఏఐటీయూసీ, సీపీఐ కార్యకర్తలు డిమాండ్ చేశారు. బుధవారం స్వామిరెడ్డి భవనం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్రప్రభుత్వ దిష్టి బొమ్మను బస్టాండ్ ప్రాంగణంలో తగులబెట్టారు. కె.ఓబులయ్య, పి. పులిరాజు, కె.నాగిరెడ్డి, అనీల్, లక్ష్మీశ్వరుడు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'

- నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- అట్టహాసంగా టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ప్రారంభం


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్


పాలమర్రిలో టేక్ హోమ్ రేషన్ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య


కొత్తపల్లిలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ కుసుమలత


జూపాడుబంగ్లాలో కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్, సూపర్‌వైజర్లు

నందికొట్కూరు: తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇంటివద్దకే బలమైన ఆహారం అందజేస్తోందని చెప్పారు. బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ డివిజనల్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు 10 రకాల పోషకాహారాలతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ, ఎంపీడీఓ శోభరాణి, ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణపోషణ కిట్లను తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ పంపిణీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్లు మల్లికార్జున, గుర్రప్ప, ఐసీడీఎస్ సూపర్వైజర్లు లలిత ప్రభావతి, అంజలీదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కుసుమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్‌హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అంగన్‌వాడీ సిబ్బంది రవణమ్మ, మరియమ్మ, శేషమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వరం..

పగిడ్యాల: మాతా, శిశు సరంక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలు మహిళలకు వరమని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. బుధవారం పాలమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అధ్యక్షతన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్) ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఈఓ సుభాన్, ఈఓఆర్డీ నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండల కేంద్రమైన జూపాడుబంగ్లాతో పాటు తూడిచెర్ల, పారుమంచాల, తాటిపాడు, పి.లింగాపురం గ్రామాల్లో ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచులు మొట్టిబాలస్వామి, బాలమద్దిలేటి, నాగార్జున రెడ్డి, వంగల లక్ష్మీదేవి, మాధవరం ప్రకాశం వైఎస్సార్ సంపూర్ణపోషణ కిట్లను బాలింత, గర్భిణులకు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పావనిరెడ్డి, నిర్మల, అంగన్‌వాడి టీచర్లు వెంకటరమణమ్మ, గురుదేవి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, తహసిల్దార్ ప్రకాష్ బాబు గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిడుతూరు ఎంపీటీసీ -1 అన్నపూర్ణమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుకాదేవి, ఏపీఓ జయంతి పాల్గొన్నారు.

కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు: పట్టణంలోని రహమత్‌నగర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ వైఎస్సార్ సంపూర్ణపోషణ పథకం కింద కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సంపూర్ణపోషణ ద్వార పోషక ఆహారం వలన తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని, ఈ కిట్లను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్ 22, 23, 24 కేంద్రాల్లో కౌన్సిలర్లు యూనస్, నూర్జహా టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- మండలంలోని సిద్దాపురం 2వ అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ వెంకటరమణ, మహిళా పోలీస్ మైమున్నీసా సంపూర్ణపోషణ కిట్లను పంపిణీ చేశారు.

ఆత్మకూరురూరల్: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఐసీడీఎస్ వారు వైఎస్సార్ పోషణ కిట్‌లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. వైఎస్సార్ పోషణ కిట్‌లో నెలకు 3కేజీల నాణ్యమైన బియ్యం, కేజి కంది బ్యాళ్లు, అర్థ కేజీ నూనె, 25 గుడ్లు, 5లీటర్ల పాలను రెండు దశల్లో అందిస్తున్నారు.


ఆత్మకూరులో కిట్లను పంపిణీ చేస్తున ముస్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

మహానంది: మండలంలోని బుక్కాపురంలోని పాదువు మహిళా సమాఖ్య భవనంలో బుధవారం వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, బుక్కాపురం సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, ఎంపీటీసీ వడుగూరి లక్ష్మీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. గోపవరం గ్రామంలో సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, ఉపసర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వెలుగోడులో మహిళలకు సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జయపాల్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ సంపూర్ణ పోషణ – టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుమారసదనం వద్ద మేకల బండలోని అంగన్‌వాడీ సెంటర్‌లో, ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎమ్ఏ రజాక్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఏడు కొండలు, కుమార్, లక్ష్మీదేవి, సీతారాం నాయక్ పాల్గొన్నారు.


శ్రీశైలంలో కిట్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎమ్ఏ రజాక్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. 20వ సెంటర్ లో మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శివట్టి వెంకటరెడ్డి, మండల నాయకులు భరత్‌రెడ్డి, 5వ వార్డు కన్వీనర్ వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎ.ప్రవీణ్ దివ్యతేజ, ఎస్‌కె గౌస్‌మొహిద్దీన్, నరసింహ, ముస్తాఫా, అంగన్‌వాడీ కార్యకర్త జి.నాగమ్మ, అందజేశారు.

భవిష్యత్తు తరాల ఆరోగ్యం కోసమే సంపూర్ణ పోషణ

వెలుగోడు: భవిష్యత్తు తరాలు ఆరోగ్యవంతంగా జీవించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని వైద్యాధికారి సాయి ప్రదీప్ అన్నారు. వెలుగోడు 1వ గ్రామ సచివాలయం పరిధిలో సర్పంచ్ వేల్పుల జయపాల్ సంపూర్ణ పోషణ – టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో హరిలీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గౌరవం పెంచుతున్న ప్రభుత్వం


మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- కులమతవర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- సంతజూటూరు గ్రామంలో 'గడప గడపకు మనప్రభుత్వం'

మహానంది: కుల, మత, వర్గాలకు అతీతంగా అర్హులైతే చాలు పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తూ పేదలకు గౌరవం పెంచుతున్నారని ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరులో 111వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ, సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా, లంచాలకు పాల్పడకుండా అవినీతి రహిత పాలన అందిస్తూ అందరికీ పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని కోరారు. అనంతరం గ్రామంలో రూ. 21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులకు పోషకాహారపు కిట్లను ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బారెడ్డి రామతులశమ్మ, మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, ముఖ్య నేతలు భూమా రఘునాథరెడ్డి, కొంగీన శివశంకర్, బారెడ్డి శంకర్‌రెడ్డి, దేకిరెడ్డి కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, పార్నపల్లె సర్పంచ్ షబ్బీర్ అహమ్మద్, సొసైటీ చైర్మన్ శివలింగం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆశయాలు నెరవేర్చాలి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ

మహానంది: పేదల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని మహానంది మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ అన్నారు. బుక్కాపురంలోని మహిళా సమాఖ్య భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మహానంది సమీపంలోని చెంచుగూడెంలో నివసిస్తున్న గిరిజనులకు మంచినీటి ట్యాంకును నిర్మించాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశించారని, అయితే అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఎంపీటీసీ సభ్యులు వడుగూరి లక్ష్మీదేవి, స్వరూప, బంగి వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, కోఆప్షన్ మెంబర్ మంటునూనె సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐకి గాయాలు

మిడుతూరు: మండలపరిధిలోని అలగనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో బుధవారం రెండు ద్వి చక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో మిడుతూరు ఏఎస్ఐ సుబ్బయ్యతో పాటు వెనుకవైపు కుర్చున్న సుబ్బరాయుడికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రవేటు హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి

మిడుతూరు: మండలపరిధిలోని జలకనూరు గ్రామంలో సయ్యద్ జలాలుద్దీన్, అబ్దుల్ సత్తార్ కుటుంబాల మధ్య రస్తా విషయంలో బుధవారం గొడవ జరిగగా ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. జలాలుద్దీన్ ఉదయం నమాజుకు వెళ్లి ఇంటికి వస్తుండగా అబ్దుల్ సత్తార్, భార్య ఖజాబీ, కూతురు నసీమా, నసీమా కూతురు యాస్మిన్, చిన్న కుమారుడు బషీర్ కట్టెలతో దాడి చేయగా గాయాలయ్యాయి. జలాలుద్దీన్ చిన్న కుమారుడు ఉస్మాన్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచండి

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని వీధుల వెంట చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని మండ్లెం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని కేజీ రోడ్డుకు ఇరువైపుల చెత్తాచెదారం పేరుకపోయి ఉండటాన్ని గుర్తించిన వెంటనే శుభ్రం చేయించాలని కార్యదర్శి విజయ్‌ని ఆదేశించారు.

నంద్యాల వెళ్లి పింఛన్ అందజేత

మిడుతూరు: మండలపరిధిలోని వీపనగండ్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మహేశ్వరయ్యల (పింఛన్ లబ్ధిదారులు) సోదరుడు శేఖర్ అనారోగ్యంతో నంద్యాలలో ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. లబ్ధిదారులు తన సొదరుడు దగ్గర ఉండటంతో గ్రామానికి చెందిన వలంటీర్ శాలిమియ్య బుధవారం నంద్యాల వెళ్లి మహేశ్వరయ్య, శ్రీనివాసులుకు పింఛన్ అందజేశారు.


నంద్యాలలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శాలుమియ్య

ఏ మొహం పెట్టుకుని ప్రాజెక్టుల సందర్శనకొచ్చారు?

- చంద్రబాబు పాలనలో కరువుకాటకాలే
- వైఎస్సార్ చలువతోనే ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం 90 శాతం నిర్మాణం
- టీడీపీ పాలనలో ఐదుశాతం పూర్తి చేసి అంతా నేనే చేశానని చెప్పకోవడం సిగ్గుచేటు
- 14 ఏళ్లు సీఎంగా ఉండి సాగునీటి ప్రాజెక్టులను విస్మరించిన చరిత్ర బాబుది


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: 14 ఏళ్ల పాలనలో వ్యవసాయం దండుగని చెప్పిన తెలుగు దేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏ మొహం పెట్టుకుని రాయలసీమ ప్రాజెక్టులను సందర్శించేందుకు వచ్చారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ప్రశ్నించారు. ఆయన పాలనలో రాష్ట్రంలో కరువు తాండవం చేసిందని గుర్తు చేశారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్టంలో చంద్రబాబు పాలనలో వరుణుడు మొహం చాటేయడంతో ప్రాజెక్టులు ఎండిపోయి తాగేందుకు నీరు లేక దాహంతో అల్లాడిపోయారని చెప్పారు. ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టేందుకే రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన పేరుతో ముసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు.

మోటార్లను పట్టిసీమకు తరలించిన ఘనుడు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరుతో రూ. 60 వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులను నిర్మిస్తే ఇక్కడ ఉన్న మోటార్లను పట్టిసీమకు తీసుకెళ్లిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టు నిర్మాణాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్ హయంలోనే రాయలసీమ ప్రాజెక్టులు 90 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ పాలనలో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తి చేస్తే, కాంగ్రెస్ హయాంలో 5 శాతం పూర్తి చేస్తే, 2014లో సీఎం అయిన చంద్రబాబు మిగత 5 శాతం పూర్తి చేసి అంతా నేనే చేశాను అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎంగా ఉన్నప్పుడు కుప్పం నియోజకవర్గానికి కనీసం తాగునీరు ఇవ్వలేని బాబు ప్రాజెక్టులను సందర్శించడం సిగ్గు చేటన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉండి సాగునీటి ప్రాజెక్టులను విస్మరించిన చరిత్ర చంద్రబాబుదన్నారు.

జగనన్న పాలనలో పుష్కలంగా వర్షాలు

జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాకా రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిడుతున్నాయని, రైతులకు రెండు పంటలకు ఏప్రిల్ చివరి వరకు కేసీ కెనాల్‌కు నీరు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగనన్నదే అన్నారు.

విజయవంతంగా జగనన్న సురక్ష

నందికొట్కూరు నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. నియోజకవర్గంలో 86, 229 ఇళ్లను సర్వే చేశారన్నారు. 49,352 దరఖాస్తులు రాగా అందులో అర్హులైన వారందరికీ 48,352 మందికి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా ఇంటి వద్దకే అందించామని చెప్పారు. 86 సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి వారికి కావాల్సిన సేవలు ఏవైనా ఉన్నాయా అని వలంటీర్ ద్వారా తెలుసుకొని వారితో దరఖాస్తు పెట్టించామన్నారు. సమావేశంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలరు ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్ట్ శ్రీను, వనజ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

మహానంది: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. గాజులపల్లె గ్రామంలో బుధవారం రాత్రి షాపుల యజమానులకు హెచ్చరికలు చేశారు. వ్యాపారాలు జరగాలని కుర్చీలు, బోర్డులు రోడ్డుకు అడ్డుపెడుతూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఓంకార సిద్ధేశ్వరస్వామికి రుద్రాభిషేకం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారం క్షేత్రంలో అధిక శ్రావణమాసం, పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు చక్రపాణిశర్మ ఆధ్వర్యంలో శ్రీ ఉమాసమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి రుద్రాభిషేకం, అర్చన పూజలు చేపట్టారు.

ఇంటింటా ఓటర్ల జాబితా పరిశీలన

వెలుగోడు: ఓటర్ల జాబితా తయారీలో తప్పులు లేకుండా నమోదు చేయాలని తహసీల్దార్ నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని జమ్మినగర్ తాండలో బుధవారం ఇంటింటా ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్, బీఎల్‌వో ఫర్జానా, బూత్ కన్వీనర్ గోపాల్ నాయ తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో అధిక దిగుబడులు

ఆత్మకూరు: బిందు, తుంపర సేద్యాలతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సత్యనారాయణ, ఏడీఏ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కరివేన రైతు భరోసా కేంద్రంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆర్‌బీకే సిబ్బందికి బిందుసేద్యంపై బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన వన అధికారి చందన, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాలను సాగునీటికి ఉపయోగించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్టు జలాలను విద్యుత్ ఉత్పాదన పేరుతో ముందు చూపు లేకుండా నీటిని వినియోగించకుండా ప్రజల తాగునీటి, వ్యవసాయ భూములకు సాగు నీటిని అందించేందుకు ఉపయోగించాలని మాజీ రాజ్య సభ సభ్యులు గంగుల ప్రతాప్‌రెడ్డి అన్నారు. శ్రీశైలంప్రాజెక్ట్ వద్ద బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ..విద్యుత్ ఉత్పాదనకు కూడా పరిస్థితులకు అనుగుణంగా నీటిని వినియోగించాలన్నారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణం ప్రారంభించి 60 సంవత్సరాలు గడిచాయని, డ్యామ్ రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సిద్ధేశ్వరం వద్ద బ్రిడ్జ్ కం బ్యారేజీని నిర్మించాలని, దీనిపై ప్రభుత్వం ఒక కమిటీని వేసి నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు. నాయకులు సికిందర్‌బాష, గన్నోజు సూరి బాబు తదితరులు ఉన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించండి

జూపాడుబంగ్లా: జగనన్నకు చెబుదాం-స్పందన ఫిర్యాదులను అధికారులు మొక్కుబడిగా క్లోజ్ చేయకుండా ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి సూచించారు. బుధవారం ఆమె జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆమె ఎంపీడీఓ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు.

పోలీసుస్టేషన్‌కు హాజరైన డీపీఓ

పారుమంచాల గ్రామంలో చోటుచేసుకొన్న ఓ ఎస్సీ, ఎస్టీ కేసు విషయమై నంద్యాల జిల్లా డీపీఓ మంజులవాణి, మంత్రాలయం ఎంపీడీఓ మణిమంజరి బుధవారం జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌కు హాజరయ్యారు. కేసుకు సంబంధించి ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఎదుట వాగ్మూలం ఇచ్చారు.

బాబుకు మాలల సత్తా చూపిస్తాం

నందికొట్కూరు: మాలల సత్తా ఏమిటో తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు చూపిస్తామని మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షులు పబ్బతి శివప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కేసును సుప్రీం కోర్టు అప్పట్లో కొట్టేసినా చంద్రబాబు సిగ్గు లేకుండా హామీ ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. వైఎస్సార్ పాలనలో నిర్మించిన ప్రాజెక్టుల సందర్శనకు వచ్చి ఓట్ల కోసం దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు ఎస్సీ వర్గీకరణ అంశం తెరపైకి తీసుకురావడం సరైంది కాదన్నారు. నాగన్న, విల్సన్, పుల్లన్న, రవి పాల్గొన్నారు.

పారుమంచాలను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దాలి

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామాన్ని సంసద్ గ్రామ్ యోజన కింద మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు అన్నిశాఖల అధికారులు సహకరించాలని ఏపీఎంఐపీ పీడీ, ప్రత్యేకాధికారి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొన్నిశాఖల అధికారులు మాత్రమే హాజరై, సమయ పాలన పాటించని, సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేయటంతో పాటు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. గ్రామంలో అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను అన్నిశాఖల అధికారులు పరస్పర సహకారంతో రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యాశర్మ, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి సత్యనారాయణ